క్లుప్తంగా

హాఫ్ మారథాన్ రన్నర్‌గా కర్నూలు అథ్లెట్



అథ్లెట్ టి.హిమబిందు

కర్నూలు (టౌన్): హాఫ్ మారథాన్ రన్నర్‌గా కర్నూలు నగరంలోని నరసింహారెడ్డి నగర్‌కు చెందిన అథ్లెట్ టి.హిమబిందు నిలిచింది. ఎన్ఎండీసీ హైదరాబాదు సంస్థ వారు ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన అత్యంత క్లిష్టమైన హాఫ్ మారథాన్‌లో 3 ఫ్లై ఓవర్ల మీదుగా 21 కిలో మీటర్లు పరిగెత్తాల్సి ఉంటుంది. ఇందులో పాల్గొన్న హిమబిందు లక్ష్యాన్ని 2 గంటల 53 నిమిషాల్లో ముగించి రన్నరప్‌గా నిలిచారు.

టీడీపీలో పదవులకు అభిప్రాయ సేకరణ

కర్నూలు(హాస్పిటల్): తెలుగుదేశం పార్టీలో పలు పదవులకు సంబంధించి పార్టీ ఏర్పాటు చేసిన త్రీమ్యాన్ కమిటీ అభిప్రాయ సేకరణ చేసింది. మంగళవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని తనిష్క్ ఫంక్షన్ హాలులో త్రీమ్యాన్ కమిటీ సభ్యులైన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అనంతపురం ఎంపీ బీకే.పార్థసారథి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు జిల్లాలో పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు సంబంధించి ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల అభిప్రాయాలు, పార్టీలో 17 అనుబంధ సంఘాలకు సంబంధించి ఆసక్తి ఉన్న వారి పేర్లను సేకరించారు. ఈ నివేదికను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు త్వరలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు అనుబంధ సంఘాలకు సభ్యులను ప్రకటిస్తారని వెల్లడించారు.

ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): భీమవరంలో ఈనెల 30న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో అండర్-17 విభాగంలో జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. కోచ్ మహేష్ మాట్లాడుతూ..బాలుర విభాగంలో నిఖిలేష్, షేక్ ఫారూఖ్, కుందన్ గౌడ్, విజయుడు, హుస్సేన్, రవీంద్రనాయక్, షణ్ముక, మోక్షాజ్ఞ, నాగ కార్తికేయ రెడ్డి, రఫీ బాలికల విభాగంలో అరుణ, కావ్యశ్రీ, సానియా, అక్షర, చిన్మయ, షరీయా, అశ్రిత్ రెడ్డి, జీవనశ్రీ, దీక్షిత, సాత్విక, మేఘన, శ్రీవైష్ణవి కావ్య రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

మార్కెట్ యార్డులో విజిలెన్స్ తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో విజిలెన్స్ అధికారులు ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. స్థానికంగా పండించిన ఉల్లి ఉండగా.. మహారాష్ట్ర నుంచి ఉల్లి గడ్డలు తెప్పించి అమ్ముతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అవి గతంలో తెప్పించినవని చెప్పి వ్యాపారులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఉల్లిగడ్డల కొనుగోలు ఈ- నామ్‌లోనే జరుగుతుందా.. ధరలు ఏ విధంగా ఉంటున్నాయి తదితర వివరాలను ఆరా తీశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మితో సమావేశమై ఉల్లి కొనుగోళ్లపై చర్చించారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోళ్లు జరుపాలన్నారు.

ట్రిపుల్‌ఐటీ డీఎంలో అవగాహన కార్యక్రమాలు

కర్నూలు సిటీ: స్థానిక ట్రిపుల్‌ఐటీ డీఎంలో మొదటి ఏడాది ప్రవేశాలు పొందిన విద్యార్థులతో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ఐపీఎస్ దీపికా పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగహన పెంచుకోవాలని, తెలియని లింక్‌లను ఓపెన్ చేయరాదన్నారు. కెరీర్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KURNOOL.

Succession on O.P. No. 7/2025

Sri M. Suresh Raja S/o. Late M. Naga Krishnaiah, aged about 57 years, Occ: Private Employee Hindu, R/o. H.No.62/151, Chidambara Rao Street, Kurnool City

- VS -

1) Superintendent of Post Offices Kurnool
2) Branch Post Master, Head Post Office, Kurnool.

ఇందుమూలముగా కర్నూలు సిటీ ప్రజలకు తెలియజేయడము ఏమనగా కర్నూలు సిటీ, చిదంబరరావు వీధిలో నివసించే ఎం. నాగక్రిష్ణయ్య గారి కుమారుడగు ఎం. సుధాకరశర్మ చనిపోయినందున వారిచే Superintendent of Post Offices Kurnool మరియు 2) Branch Post Master, Head Post Office, Kurnool నందు ఉంచబడిన ఈ క్రింది షెడ్యూలు మొత్తములను పొందుటకు గాను అర్జీదారు Succession Certificate ఇవ్వమని కోరుతూ, పై అర్జీదాఖలు చేసినాడు. ఇందు విషయమై ఎవరికైన అభ్యంతరములున్న యెడల తేది : 11-09-2025 ఉదయం 10-30 గంటలకు పై కోర్టునందు ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షములో విచారించి తీర్మానించబడును.

SCHEDULE OF DEPOSITS

S. No.	Account Type	Certificate No.	Amount Deposited	Maturity Value
1	KVP	08GG042547	50,000-00	1,04,000-00
2	KVP	08GG042548	50,000-00	1,04,000-00
3	KVP	00BD342116	50,000-00	1,02,750-00
4	KVP	00BD342117	50,000-00	1,02,750-00
5	KVP	00BD342118	50,000-00	1,02,750-00
6	KVP	00BD342119	50,000-00	1,02,750-00
7	KVP	00BD342120	50,000-00	1,02,750-00
8	KVP	00BD342121	50,000-00	1,02,750-00
9	KVP	00BD342441	50,000-00	1,02,750-00
10	KVP	00BD342442	50,000-00	1,02,750-00
11	KVP	3736786248	2,00,000-00	3,20,739-00
12	S.B.	0584368635		18,67,712-00
13	MIS	020044206003		1,17,000-00
14	MIS	4973561735		1,53,000-00
15	MIS	4851968571		1,80,000-00
		TOTAL		36,68,451-00

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
యం.డి.వి. జోగయ్యశర్మ,
అర్జీదారు పరము వకీలు, కర్నూలు.


కొండారెడ్డిబురుజు సమీపంలో పూజా సామగ్రి కొనుగోళ్లు


మద్దూర్ నగర్‌లో విక్రయానికి ఉంచిన వినాయక ప్రతిమలు


మట్టి విగ్రహాల పంపిణీకి సిద్ధంగా వివేకానంద స్టడీ సర్కిల్ కో-ఆర్డినేటర్ నాగఫణిశాస్త్రి, వలంటీర్లు

వినాయక చవితి సందడి

విఘ్నాలు తొలగించే వినాయకుడి ఉత్సవాలను వైభవంగా జరుపుకునేందుకు నగర ప్రజలు సిద్ధమయ్యారు. చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని ప్రధాన కూడళ్లలో వ్యాపారులు పూజా సామగ్రి, స్వామివారి ప్రతిమలు, పండ్లు, పూలు, అరటి మట్టలు, మామిడాకులు, బిల్వం, గరక, ఉత్తిరేని ఆకులు, టెంకాయ మట్టలను విక్రయానికి ఉంచగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కొనుగోలు చేశారు. వినాయకుడికి పిండి వంటలు, పండ్లు, పూలు, ఆకులతో అలంకరించేందుకు నగర ప్రజలు భారీగా కొనుగోలు చేయగా ఎక్కడిచూసినా సందడిగా కనిపించింది. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


పెద్దమార్కెట్ వద్ద పండ్లను కొనుగోలు చేస్తున్న భక్తులు


మద్దూర్ నగర్‌లో వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి విక్రయాలు


సి.క్యాంప్ సర్కిల్ వద్ద గణేశ్ ప్రతిమల విక్రయం

పార్టీని మరింత బలోపేతం చేద్దాం


జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి పార్టీ క్యాలెండర్ ప్రతిని అందజేస్తున్న నాయకులు

కర్నూలు(టౌన్): గ్రామ, మండల, నియోజవర్గ, జిల్లా స్థాయిల్లో ప్రజలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేద్దామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జలతో కలిసి నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన జిల్లా పార్టీ ముఖ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా రూపొందించిన పార్టీ కార్యక్రమాల నిర్వహణ క్యాలెండర్‌ను జిల్లా పార్టీ నేతలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ వారం జిల్లా కోర్ కమిటీ, ప్రతి మూడు నెలలకోసారి జిల్లా కమిటీ, ప్రతి నెలా మొదటి వారం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం, ప్రతి నెలా మండల స్థాయి, గ్రామ స్థాయి కమిటీల సమావేశాలు నిర్వహించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈ పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి పోరాటం చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, పార్టీ నేతలు పాటిల్ హనుమంతరెడ్డి, రామాంజినేయులు, ఆక్కెం హనుమంతరెడ్డి, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరికరాల ప్రారంభం


ఆటో అనలైజర్ మిషన్‌లను ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఉన్న బయోకెమిస్ట్రీ విభాగంలో రెండు అధునాతన క్లినికల్ కెమిస్ట్రీ అనలైజర్ మిషన్‌లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొదటిసారిగా బయోకెమిస్ట్రీకి రూ.1.20 కోట్ల విలువ చేసే మిషన్‌లను స్టాండ్ బై కింద బ్యాక్ మ్యాన్ కంపెనీ వారు విరాళంగా అందించారని తెలిపారు. వీటి ద్వారా రోగులకు కచ్చితమైన, వేగవంతమైన రిపోర్ట్ అందుతుందని చెప్పారు. బయోకెమిస్ట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ రూత్ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ సింధియా శుభప్రద, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో మంగళవారం కాలుష్య నియంత్రణ మండలితో కలిసి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంద వినాయక విగ్రహాలలో పండ్ల మొక్కల విత్తనాలను ఉంచి న్యూరోసర్జన్ డాక్టర్ విశ్వకుమార్, నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్దార్థ్ హెరూర్ కలిసి వైద్యులు, ఉద్యోగులు, రోగుల సహాయకులకు అందజేశారు. ఈ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల పండ్ల విత్తనాలు మొలకెత్తి పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు.

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని బండిమెట్టలో మంగళవారం డాక్టర్ శంకర్ శర్మ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

విస్తరణ పనులకు సహకరించండి


మాట్లాడుతున్న జేసీ డాక్టర్ నవ్య

కర్నూలు (టౌన్): నగర పరిధిలో దామోదరం సంజీవయ్య కూడలి నుంచి కేవీఆర్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణలో ప్రభావితమయ్యే ఆస్తి యజమానులు నగరాభివృద్ధికి సహకరించాలని జేసీ డాక్టర్ బి.నవ్య కోరారు. మంగళవారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సంతోషి ఫంక్షన్ హాలులో ప్రభావిత ఆస్తి యజమానులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. నగరానికి భవిష్యత్తులో రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు రహదారి విస్తరణ పనులు అవసరమన్నారు. ఆస్తులు కోల్పోయే వారికి టీడీఆర్ బాండ్లు జారీ చేస్తున్నామన్నారు. నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ.. ఇప్పటికే ముగ్గిరికి టీడీఆర్ బాండ్లు ఇచ్చామని, మరో 47 మందికి త్వరలోనే అందిస్తామన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

కర్నూలు (అగ్రికల్చర్): రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఆగస్టులో వర్షాలు కురిశాయని, యూరియా వేస్తే పంటలు కోలుకొనే అవకాశం ఉందన్నారు. ఆలస్యంగా యూరియా వేస్తే ఉపయోగం ఉండదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా యూరియా కొరత రైతులను వేధిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఎరువుల కొరత లేదన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించే మాఫియాలు ఎక్కువయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసి వ్యవసాయం దండగ అనే పరిస్థితి తెచ్చిందని దుయ్యబట్టారు. వచ్చిన అరకొర యూరియా టీడీపీ నేతల ఇళ్ల వద్దకు చేరుతోందని విమర్శించారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం యూరియాను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలోని వినాయక్ ఘాట్ వద్ద సెప్టెంబర్ 4న నిర్వహించనున్న గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక కార్యాలయంలో గణేష్ మహోత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. లైటింగ్, క్రేన్లు, అదనపు డ్రైవర్లు, అందుబాటులో మెకానిక్‌లు, చెక్‌పోస్టు నుంచి పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు మైక్ సిస్టమ్, మూడు షిఫ్టులుగా పారిశుద్ధ్య సిబ్బందిని నియమిస్తున్నట్లు చెప్పారు. కమిటీ సభ్యులు వేణుగోపాల్, గోరంట్ల రమణ, రంగస్వామి, గిరిరాజ్ వర్మ పాల్గొన్నారు.

త్వరలో రహదారి విస్తరణ పనులు

కర్నూలు (టౌన్): నగరంలో రహదారి విస్తరణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఉస్మానియా కళాశాల వద్ద విస్తరణ పనులు చేపట్టాల్సిన రహదారి మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవార పేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉందన్నారు. మొత్తం 740 మీటర్ల పొడువునా పనులు జరుగుతాయని, ఆస్తులు కోల్పోయే వారికి 183 మందికి త్వరలో పరిహారం అందిస్తామన్నారు.

ఉచితంగా నర్సింగ్ విద్య

కర్నూలు(అర్బన్): స్థానిక క్రిష్ణానగర్‌లో ఉన్న ఆదర్శ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థినులకు ఉచితంగా నర్సింగ్ విద్యను అందిస్తున్నట్లు కరస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్ 98483 52725 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

కర్నూలు(సెంట్రల్): రైతులను వివిధ రూపాల్లో మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కమిటీ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. అన్నదాతలు యూరి యా లేక అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు కూటమి పార్టీల నాయకులు తమ స్వార్థంతో యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలిండంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. మరోవైపు జిల్లాలో విస్తారంగా పండే ఉల్లికి గిట్టుబాటు ధర లు లేకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం కలుగజేసుకొని క్వింటాల్ ఉల్లిని కనీసం రూ.2 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, ఎండీ ఆనంద్‌బాబు, జి.రామకృష్ణ, కె.వెంకటేశ్వర్లు, కేవీ నారాయణ, టి.రాముడు, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

కర్నూలు(సెంట్రల్): అభివృద్ధి పేరుతో బలవంతపు భూసేకరణను ఆపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు వినతిపత్రం ఇచ్చారు.ఆయన మాట్లాడుతూ.. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో సోలార్ కోసం కంపెనీలు ఏజెంట్లను నియమించుకొని రైతుల నుంచి తక్కువ రేటుకు భూమిని ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. బలవంతపు భూసేకరణను ఆపాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ నాటక పోటీలకు ఎంపిక

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని రెండు పరిషత్‌ల నాటక పోటీలకు 'జగదేక సుందరి సామ' పద్యం నాటకం ఎంపికైందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నాటక దర్శకులు పత్తి ఓబులయ్య తెలిపారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు తెనాలిలో సినీ రచయిత బుర్ర సాయిమాధవ్ నిర్వహించే పద్య నాటక పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ నాటక ప్రదర్శన సెప్టెంబర్ 30న ఉంటుందని వెల్లడించారు. వచ్చే నెల 5 నుంచి 9వ తేదీ వరకు అనంతపురంలో రెవెన్యూ సర్వీసెస్, ప్రముఖ కళాకారుడు మైఖేల్ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు ఎంపికైందని, 5న సాయంత్రం 6 గంటలకు అనంతపురం శ్రీకృష్ణ కళా మందిరంలో ప్రదర్శన ఉంటుందని వివరించారు.

దివ్యాంగుల పింఛన్ తొలగించడం అన్యాయం


ధర్నా చేస్తున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్లను తొలగించి అన్యాయం చేస్తోందని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ విమర్శించారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై దయ లేకుండా ప్రవర్తిస్తోందన్నారు. కాళ్లు, చేతులు లేకుండా ఆ దేవుడు అన్యాయం చేస్తే...పెన్షన్లను తొలగించి సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో అధికారులు ఇచ్చిన సదరం సర్టిఫికెట్ల ప్రకారం ఉన్న వికలత్వం ఇప్పుడు ఎలా తగ్గిపోతుందని ప్రశ్నించారు. కేవలం పెన్షన్లను తొలగించాలన్న ఉద్దేశంతోనే వైకల్య శాతం తొగ్గిస్తున్నారని, దివ్యాంగ పెన్షన్లను సాధారణ పెన్షన్లుగా మారుస్తుండడం దేనికి సంకేతమన్నారు. మరోవైపు దివ్యాంగులకు ఉద్యోగాల్లో అర్హత వయసును 50 ఏళ్లకు పెంచాలని, రిజర్వేషన్ శాతాన్ని 4 నుంచి 6 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. దివ్యాంగ పింఛన్లు తొలగించడాన్ని ఆపకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.సురిబాబు, రాజశేఖర్, ఆంజనేయులు, దాసు, దేవిపుత్ర, రామాంజనేయులు, రాధా, మద్దిలేటి, అయ్యన్న పాల్గొన్నారు.

చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): గణనాథుడి కృపతో జిల్లా ప్రజలంతా సంతోషంగా ఉండాలని, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటున్నట్లు మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు చెప్పారు. ప్రతి పనిలో విజయం సమకూరేలా వినాయకుడు విఘ్నాలను తొలగించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని పిలుపునిచ్చారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

కర్నూలు: జిల్లా ప్రజలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరిక శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. ఉత్సవాలు ప్రశాంతంగా పూర్తయ్యేందుకు నిర్వాహకులు, మేధావులు, మతపెద్దలు, రాజకీయ పార్టీలు, యువత, మీడియా వారు సహాయ సహకారాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

లోక్ అదాలత్ జోక్యంతో వీధి దీపాల ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ నుంచి చైతన్య జూనియర్ కాలేజీ వరకు శాశ్వత లోక్ అదాలత్ జోక్యంతో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. వాదులైన మహబూబ్‌బాషా, బి.రామలింగప్ప, మూర్తి, కాశీంసాహెబ్ ఆ మార్గం వెంబడి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రతివాదిగా డీపీఓను చేర్చి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. ఆయన ఇరు పక్షాలతో మాట్లాడి వీధి దీపాలను ఏర్పాటు చేయించడంతో సమస్య పరిష్కారమైనట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్, సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజబాబు వెల్లడించారు.